క్లుప్తంగా

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



నిండుగొండ కూడలి సమీపంలో పొక్లెయిన్‌తో తవ్వకం పనులు

రోలుగుంట: నర్సీపట్నం -వడ్డాది ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులు చురుగ్గా చేస్తున్నారు. దీనిలో భాగంగా వెలంకాయలపాలెం నుంచి రోలుగుంట కొత్తచెరువు దాటే వరకు నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ జేఈ జయరాజ్ పర్యవేక్షణలో చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనులు పూర్తి చేసిన తర్వాత ఈ రోడ్డుపై ఒక లేయర్ వేసి గోతులు పూడ్చి వాహనాల రవాణా సౌకర్యం మెరుగుపరుస్తామని వివరించారు. ఈ పనులు చేయడంపై వాహనచోదకులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం

మాకవరపాలెం: మండలంలోని పి.పి.అగ్రహారం అమృతేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు బ్రహ్మయ్యశర్మ తెలిపారు. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి వివిధ పూజలు, హోమాలు ప్రారంభిస్తామన్నారు. రాత్రి 8 గంటలకు కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు హాజరై స్వామిఅమ్మవారిని దర్శించుకోవాలన్నారు.

ఘనంగా జ్ఞాన మల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



జ్ఞాన మల్లేశ్వరునికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

కె.కోటపాడు: గొండుపాలెంలో జ్ఞాన మల్లేశ్వర స్వామి 15వ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ స్వామివారి ఆలయానికి ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చినదొర, బండారు చినదొర, రాంబాబు, అప్పలపాత్రుడు, రామన్నపాత్రుడు పాల్గొన్నారు.

అసంపూర్తిగా కమ్యూనిటీ భవన నిర్మాణం



యడ్లవానిపాలెంలో భవనం

కె.కోటపాడు: యడ్లవానిపాలెంలో కమ్యూనిటీ భవన నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. 2007లో దీని నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో ప్రారంభమైన నిర్మాణం శ్లాబ్ స్థాయికి చేరుకునే సరికి అదనపు నిధులు అవసరమయ్యాయి. సంబంధిత శాఖాధికారులకు నిర్మాణదారుడు విన్నవించినా నిధులు మంజూరు కాలేదు. దీంతో భవన నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. గ్రామంలో పండగ, ప్రత్యేక సందర్భాల్లో సాంస్కృతిక, సమావేశాల నిర్వహణకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పూర్తి చేయాలని కోరుతున్నారు.

వైభవంగా వాసవీమాత పుట్టిన రోజు వేడుకలు



వాసవీమాతను దర్శించుకుంటున్న వాసవీ క్లబ్ సభ్యులు

మాడుగుల: జంపెనలో వాసవీమాత పుట్టిన రోజు వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చనలో 300 కుటుంబాలు పాల్గొన్నాయి. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ సభ్యులతోపాటు ఆలయ చైర్మన్ పుట్టా మోహన్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఉపాధి' జోరు

- ఉదయం 5 గంటలకే పనులు ప్రారంభం
- రూ. 272కు పెరిగిన రోజువారి కూలి
- రూ. 24 కోట్ల అభివృద్ధి పనులు లక్ష్యం



దిబ్బిడి చెరువులో పనిచేస్తున్న కూలీలు

బుచ్చెయ్యపేట: గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోవడంతో ఉపాధి హామీ పథకం పనులకు వేతనదారుల జాతర మొదలైంది. గతంలో ఉదయం ఎనిమిది గంటలకు ఉపాధి పనులకు రాని కూలీలు ఇప్పుడు పలు గ్రామాల్లో వేకువజాము ఐదు గంటలకే పని ప్రాంతాలకు చేరుకుంటున్నారు. తీవ్రమైన వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ఈ సమయాన్ని పాటిస్తున్నారు.

గతంలో రోజువారి కూలి రూ.257 ఉండగా, ప్రభుత్వం ఈ ఏడాది రూ.272కు పెంచింది. పెరిగిన ఉపాధి కూలి, ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పలు గ్రామాల్లో కూలీలు సమయ వేళలను మార్చుకున్నారు. తెల్లవారుజాము ఐదు గంటల నుంచి ఉపాధి చెరువు పనులకు హాజరవుతున్నారు. శుక్రవారం చింతపాకలో ఐదు గంటలకే ఉపాధి కూలీలు నమ్మివాని చెరువులోకి వచ్చి పనులు ప్రారంభించారు. బుచ్చెయ్యపేట, శింగవరం, దిబ్బిడి, మంగళాపురం, విజయరామరాజుపేట, కొండపాలెం, పొట్టిదొరపాలెం, కొమ్మల్లపూడి తదితర గ్రామాల్లో ఉదయం 5 నుంచి 7 గంటల లోపే ఉపాధి పనులకు కూలీలు హాజరయ్యారు. ప్రతి కూలీ రోజుకు సగటున నాలుగు గంటలు పని చేయాలి. గతంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎండలో ఉండి పనులు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా కూలీలు ఉదయం 5 గంటలకే ఉపాధి పనులకొస్తున్నారు. 9 గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనిచేసి ఎండ దెబ్బ తగలకుండా ఇళ్లకు చేరడంపై అధికారులు సైతం కూలీల పని వేళల మార్పుపై హర్షిస్తున్నారు.

5,35,023 పని దినాల కల్పన లక్ష్యం

కొత్త సంవత్సరంలో బుచ్చెయ్యపేట మండలంలో రూ. 24 కోట్లుతో ఉపాధి పనులు చేయాలన్న లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టారు. రూ. 14.55 కోట్లు కూలీలకు వేతనాల రూపంలో రూ.9.70 కోట్లు మెటీరియల్ ఖర్చు కింద పనులు చేయాలని నిర్ణయించినట్లు ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. 35 పంచాయతీల్లో 11,938 జాబ్ కార్డులుండగా, 21,488 మంది కూలీలున్నారు. వీరికి 5,35,023 పని దినాలు కల్పించాలని ప్రతిపాదనలు చేశామన్నారు. ఒక్కో కూలీ కుటుంబానికి సగటున ఏడాదికి రూ. 27,200 అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వడదెబ్బకు గురికాకుండా...



చింతపాకలో కూలీలు శుక్రవారం ఉదయం 5 గంటలకే ఉపాధి పనులు చేయడానికి చెరువులోకి వచ్చారు. గతంలో ఉదయం 8 గంటలైనా పనులకు వచ్చేవారు కాదు. త్వరగా పనులకు రావడం వల్ల ఎండ తగలకుండా 10 గంటలలోపే ఇంటికెళ్లి పోతున్నారు. తద్వారా వడదెబ్బ తగలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

– డి. కొండాజీ, ఈసీ, బుచ్చెయ్యపేట

కూలీలకు సగటున రోజుకు నాలుగు గంటల పని



గతంలో ఉదయం 8 గంటలకొచ్చి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎండలో పని చేసేవారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో ఉదయం 6 గంటల లోపు వచ్చి 10 గంటలకు ఇంటికెళ్లిపోతున్నారు. అన్ని గ్రామాల కూలీలు ఈ సమయాన్ని అలవాటు చేసుకోవాలి. రోజు కూలీని రూ.272కు పెంచారు.

– మురళీ, ఉపాధి ఏపీవో, బుచ్చెయ్యపేట

సంక్షేమ పాలనతో ఆనందం వెల్లువ

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- బోయిలకింతాడలో నూతన అంగన్‌వాడీ భవనం, నాడు–నేడు పనులు ప్రారంభం



మంచంపై కూర్చొని వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అవినీతికి తావులేకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించడంతో ప్రతి ఇంటా ప్రజల మోములో ఆనందం వెల్లివిరుస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన బోయిలకింతాడలో ఇంటింటికి తిరిగారు. అవ్వాతాత, అక్కచెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరించి, సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ సచివాలయం పరిధిలో అత్యవసర పనులు నిమిత్తం రూ. 20 లక్షలు మంజూరు చేశారు. ఎంపీయూపీ స్కూల్‌లో రూ.18.89 లక్షలతో చేపట్టిన నాడు–నేడు అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించి, రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్ కోసం సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధ్వానంగా ఉన్న మట్టిరోడ్లను తారు రోడ్లుగా, సీసీరోడ్లుగా అభివృద్ధి చేయడం, గ్రామాలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలకు కల్పించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ రూ.1.45 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో అదనపు మంచినీటి ట్యాంక్ నిర్మించి, ప్రతీ ఇంటికి కుళాయి నీటిని త్వరలో సరఫరా చేస్తామన్నారు. సీఎం జగన్ పాలనలో గ్రామానికి చెందిన 2,803 మందికి సంక్షేమ పథకాల ద్వారా రూ. 6.93 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. 111 మందికి ఇళ్ల స్థలాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, పీఆర్ డీఈ టి.రమణ, ఏఈ కె. ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగాభవానీ, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ రుత్తల లక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేడుకగా పెళ్లి రాట మహోత్సవం



శివకేశవ ఆలయంలో పెళ్లిరాట వేస్తున్న భక్తులు

రావికమతం: ప్రసిద్ధి చెందిన కొత్తకోట శివకేశవ స్వామివార్ల ఆలయంలో సోమవారం శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామివారి, రాజరాజేశ్వరి సమేత రాజలింగేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పెళ్లి రాట వేడుకగా జరిగింది. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆయా ఆలయాల్లోని స్వామి స్వామివార్లకు ఒకే వేదికపై పాంచరాత్ర, శైవాగమోక్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నారు. దేవదాయ శాఖ ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. నేడు కల్యాణోత్సవాలు, ఈ నెల 3న సదస్సోత్సవం నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయా ఆలయాల చైర్మన్లు గుమ్మడు దొరబాబు, పెనుగొండ నానాజి కోరారు.

కన్యకాపరమేశ్వరికి సామూహిక కుంకుమార్చన



అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు

దేవరాపల్లి: కొత్తపెంటలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ కంచర్ల నారాయణరావు, క్లబ్ మెంబర్ల సమక్షంలో 30 మంది దంపతులు భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

కోతుల బెడదతో రైతుల ఆందోళన

- పంటల రక్షణకు వినూత్న ప్రయోగాలు



ఎ.పి.పురంలో పొలాల్లో ఏర్పాటు చేసిన పులిబొమ్మలు

నాతవరం: మండలంలో ఎక్కడ చూసినా కోతుల గుంపులు దర్శనమిస్తున్నాయి. ఇవి పొలాల్లో పంటలను ధ్వంసం చేయడమే కాకుండా గ్రామాల్లోనూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటి బెడద నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కాపోడుకోవడానికి రైతులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతమంది ఎలుగుబంటి వేషంలో పొల్లాల్లోకి వెళ్లి వాటిని తరిమివేస్తున్నారు. మరికొంత మంది పులి మాదిరిగా ఉండే బొమ్మలను పొలాల గట్లుపై ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల కోతులు ఆయా ప్రాంతాల వైపు వెళ్లడం లేదు. మండలంలోని 31 పంచాయతీల్లో జీడి, మామిడి, జామ తోటలతోపాటు కూరగాయల పంటలు సాగు చేస్తుంటారు. ఆయా పంటలను కోతుల గుంపు నాశనం చేయడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి రాత్రిళ్లు వాహనాలపై వీటిని తీసుకువచ్చి పెడిమికొండ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో ఈ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో చందాలు వేసుకుని బోనులు ఏర్పాటు చేసి బంధించి ఇతర ప్రాంతాలకు తరలించి వ్యవసాయాన్ని కాపాడుకుంటున్నారు. ఈ కోతుల సమస్యపై అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన గ్రామాల్లో శిశు ఆధార్ నమోదు



చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్న నిర్వాహకుడు నాయుడు

రోలుగుంట: స్థానిక మీ సేవ నిర్వాహకుడు మైదాన గ్రామాలతోపాటు గిరిజన గ్రామాల్లోనూ శిశు ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అర్ల గిరిజన పంచాయతీ శివారు జాజులబంద, పీత్రుగెడ్డ గిరిజన గ్రామాల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి పది మంది శిశువుల వివరాలను వారి తల్లిదండ్రుల నుంచి సేకరించి ఆధార్ నమోదు చేశారు. గ్రామానికే వచ్చి ఈ కార్యక్రమం నిర్వహించడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా 'జూపూడి' జన్మదిన వేడుకలు



జూపూడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న దళిత సంఘం నాయకులు

బుచ్చెయ్యపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు జన్మదిన వేడుకలను వడ్డాది మేజర్ పంచాయతీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాల మహానాడు విశాఖ యువజన సంఘం అధ్యక్షుడు బూసి కోటి ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీలో కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీకాంత్, ఆర్క్ సంస్థ ప్రతినిధి ప్రసాద్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసు, మహిళా అధ్యక్షురాలు మరియమ్మ, నాయకులు కోరుకొండ రమణ, భాస్కర్, రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆవు పెయ్యి మృతి

బుచ్చెయ్యపేట: నేతవానిపాలెం గ్రామంలోని వీధి కుక్కల దాడిలో లేగ దూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన వియ్యపు జితేంద్ర ఆవుకు చెందిన మూడు నెలలు వయస్సు గల ఆవుపెయ్యిపై ఆదివారం వీధి కుక్కలు దాడి చేశాయి. దాంతో మృతి చెందినట్టు పాడి రైతు వాపోయాడు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

అనకాపల్లిటౌన్ : బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ అధ్యక్షుడు ఎస్.కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్.చంద్రశేఖర్‌లు అన్నారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీజియన్ పరిధిలో 42 బ్రాంచ్‌ల సిబ్బంది ఖాతాదారులకు మంచి సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల నిధిని ఖాతాదారులకు సకాలంలో అందించాలని సూచించారు. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు బ్యాంకు ఆవరణలో మౌలిక వసతుల ఏర్పాటుకు సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు స్థానిక ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ నుంచి ర్యాలీగా సభా స్థలికి చేరుకున్నారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు.

నేడు మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ ఇలవేల్పు మోదకొండమ్మ అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఉదయం నుంచి అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం 8 గంటల నుంచి క్షీరాభిషేకం చేస్తామన్నారు. సాయంత్రం నుంచి ఆలయంలో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎంపీ సత్యవతి జన్మదిన వేడుకలు



ఎంపీ సత్యవతితో జన్మదిన కేక్‌ను కట్ చేయిస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు ఆధ్వర్యంలో బోయిలకింతాడలో పార్టీ శ్రేణుల మధ్య అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో ఆమె కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారితోపాటు పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు ఎంపీకి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమెను సత్కరించారు.

వడ్రపాలెంలో ఘనంగా ఎర్నితల్లమ్మ తీర్థం

- ఎడ్లబళ్ల పోటీల విజేతలకు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు అభినందన



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వడ్రపాలెంలో ఎర్నితల్లమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎడ్లబళ్ల పోటీల్లో విజేతలను అభినందించి నగదు బహుమతులను ప్రదానం చేశారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళా కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జెడ్పీటీసీ కర్రి సత్యం, వేచలం సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, వడ్రపాలెం గ్రామ పెద్దలు, ప్రజలు, గ్రామ యువజన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రానైట్ పనులను అడ్డుకున్న ఆదివాసీలు



గ్రానైట్ సిబ్బందిని నిలువరిస్తున్న ఆదివాసీలు

రావికమతం: మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు తాటిపర్తి, రాయిపాడు, పెదగరువు గ్రామాల సమీపాల్లోని జీడి తోటల్లో సర్వే రాళ్లు పాతుతున్న గ్రానైట్ సిబ్బందిని ఆయా గ్రామాల ఆదివాసీలు ఆదివారం అడ్డుకున్నారు. సర్వే నెంబరు 32లో రాజయోగ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో ప్రభుత్వం గ్రానైట్ కంపెనీకి అనుమతులిచ్చిందని, ఆ మేరకు ప్రైవేటు సర్వే సిబ్బందితో రాళ్లు వేస్తున్నామని గ్రానైట్ కంపెనీ ప్రతినిధులు చెప్పడంతో గిరిజనులు పెద్ద ఎత్తున నిలువరించారు. కల్యాణపులోవ రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో ఇప్పటికే ఉన్న గ్రానైట్ కంపెనీలను రద్దు చేయాలని తాము పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తుంటే, మళ్లీ కొత్త కంపెనీకి అనుమతులివ్వడంపై ఆగ్రహించారు. దీనిపై కలెక్టర్‌ను కలుస్తామని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్, ఆదివాసీలు తమన్నరాజు, సీది రాముడు తదితరులు తెలిపారు.

కేబుల్ ఆపరేటర్ల నిరసన



వడ్డాదిలో నిరసనకు దిగిన కేబుల్ ఆపరేటర్లు

బుచ్చెయ్యపేట: ట్రాయ్, బ్రాడ్‌కాస్టర్లు కలిసి గ్రామాల్లో సిటీ కేబుల్‌పై పెంచుతున్న అదనపు భారాన్ని తగ్గించాలని కేబుల్ ఆపరేటర్లు నిరసనకు దిగారు. ఆదివారం వడ్డాది చెరకు కాటా నుంచి నాల్గు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో రైతులంతా ఉదయం పొలాల్లోకి వెళ్లి రాత్రికి ఇంటికొస్తారన్నారు. టెలీకం రెగ్యులేటరీ అథారిటీ(ట్రాయ్) చానళ్లపై వినోదపు పన్నును పెంచడం వల్ల రోజులో కొద్ది సమయం మాత్రమే టీవీలు చూసే గ్రామీణ ప్రజలపై తాము ధర పెంచాల్సి వస్తుందని వాపోయారు. బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగుల తదితర మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన డీఎస్పీ



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నూతన డీఎస్పీ వి.సుబ్బరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. ఇరువురు కాసేపు జిల్లాలో భద్రతాపరమైన అంశాలపై మాట్లాడుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఒకేచోటకు చేరిన పూర్వ విద్యార్థులు

గొలుగొండ: స్థానిక అల్లూరి సీతారామరాజు పార్కులో 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో చదివిన వీరంతా ఒకేచోటకు చేరి కష్టసుఖాలు పంచుకున్నారు. అప్పట్లో తమకు పాఠాలు బోధించిన పది మంది ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఏఎల్‌పురం హైస్కూల్‌లో ప్రస్తుతం చదువుతున్న పేద విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందించడం కోసం తీర్మానం చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయం ముందు రహదారిపై క్యూకట్టిన భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి నెల పండగ పూర్తయినప్పటికీ ఇంత పెద్దసంఖ్యలో హాజరు కావడంతో ఆలయం కళకళలాడింది. క్యూలైన్లు కిక్కిరిసి, ఆలయ ముందు భాగంలో రహదారిపై అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా దేవదాయ శాఖాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. చిన్నారులకు బాలింతలు పాలిచ్చేందుకు ఆలయ ఆవరణలో ప్రత్యేక గది ఏర్పాటు చేశారు.

తట్టబందలో 'గడప గడపకు' నేడు

రావికమతం: తట్టబంద గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఉదయం 6 గంటల నుంచి నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలన్నారు.